క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



విజేతలకు షీల్డ్ అందిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని వైస్ ఎంపీపీ మదిరెడ్డి దొరబాబు అన్నారు. ఉప్పాడలో జరుగుతున్న ఉప్పాడ క్రికెట్ టోర్నమెంటు మంగళవారంతో ముగిసింది. ఉప్పాడ యూత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఎండీబీ యూత్ టీమ్ జట్టు విజేతగా నిలిచింది. వీరికి షీల్డు అందజేశారు. ఈ టోర్నమెంటులో 12 టీములు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచే ఎంతో మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పోటీపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కీడాకారులను ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రోత్సహించాలి. ఈ కార్యక్రమంలో దున్న హరినాథ రాజా, నక్కా సతీష్, సూరాడ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ నీటి పంపిణీయే లక్ష్యం



గణపతినగరంలో ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

సామర్లకోట: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీఎంఏ నయీం అహ్మద్ తెలిపారు. మంగళవారం గణపతినగరంలోని వాటర్ ట్యాంకులను శుభ్రపరచడాన్ని ఆయన పరిశీలించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాగార్జున ఫిల్టర్ చెరువులో నీటి మట్టం తక్కువగా ఉండటంతో ప్రతి రోజూ ఫిల్టర్ బెడ్ వద్ద నీటిని పరిశీలిస్తున్నట్టు తెలిపారు. ట్యాంకులను శుభ్రం చేయగా వచ్చిన నీటిని వాల్వుల ద్వారా బయటకు విడిచి పెడుతున్నట్టు తెలిపారు. బుధవారం కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న ట్యాంకులను శుభ్రం చేయిస్తామని చెప్పారు. మూడు నెలలకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేసేలా తేదీని అక్కడ పొందుపరుస్తున్నట్టు తెలిపారు.

సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

డీఎం అండ్ హెచ్ఓ రమేష్



సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ రమేష్

పెద్దాపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు మంజూరైన సంపూర్ణ సురక్ష కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ ఆర్.రమేష్ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఐసీటీసీ కేంద్రం అనుసంధానంగా ఏర్పాటు చేసిన సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని మంగళవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ విష్ణువర్ధినితో కలిసి ప్రారంభించారు. జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జి.ఆదిలింగం అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ సుఖ వ్యాధులు, హెచ్ఐవీ పరీక్షల నిమిత్తం వచ్చిన వారికి కౌన్సెలింగ్, పర్యవేక్షణ లక్ష్యంతో ప్రభుత్వాసుపత్రిల్లో సురక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి పెద్దాపురంలో ఈ సురక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డీఐఎస్ బుజ్జిబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ బి.శ్రీనివాస్, వైద్యులు టి.విజయ్‌చంద్రారెడ్డి విజయ్‌శేఖర్, ఎ.శ్రీనివాస్, నిహారిక, రత్నకుమారి, రత్నమణి తదితరులు పాల్గొన్నారు.

పాల వెల్లువపై అవగాహన పెరగాలి



వలంటీర్ల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలలిత

సామర్లకోట: జగనన్న పాల వెల్లువపై వలంటీర్లు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ డి.శ్రీలలిత అన్నారు. మంగళవారం సాయంత్రం మండల పరిధిలో పీబీ దేవం గ్రామ సచివాలయంలోని వలంటీర్లకు 'జగనన్న పాల వెల్లువపై' శిక్షణలో ఆమె పాల్గొన్నారు. రైతుల నుంచి ప్రభుత్వం పాలు సేకరించడానికి నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, జగనన్న ఆసరా పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి గేదెలు కొనుగోలు చేయడానికి సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. వీరి వద్ద నుంచి అమూల్ డెయిరీ ద్వారా పాలు కొనుగోలు చేసి రైతులకు లాభ సాటి ధర చెల్లిస్తున్నట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవల్లో అధికారుల పాత్ర కీలకం

- ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది
- పెద్దాపురంలో నాడు–నేడు పనుల పరిశీలన



జి.రాగంపేటలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఎస్ ద్వివేది, కలెక్టర్ కృతికా శుక్లా

పెద్దాపురం: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో అధికారులదే కీలకపాత్ర అని ప్రభుత్వ ప్రత్యేకాధికారి గోపాలకృష్ణ ద్వివేది అన్నారు. పట్టణంలో కొండయ్యపేట పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులు, మండలంలోని జి.రాగంపేటలో సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన కలెక్టర్ కృత్తికా శుక్లా, ఆర్డీఓ జేఎస్ రామారావు, జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీఎల్‌పీఓ బాలామణి, డీఎల్‌డీఓ ప్రసాద్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొండయ్యపేట పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. జి.రాగంపేటలో సంపద తయారీ కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి మరింత మెరుగ్గా పంచాయతీ అభివృద్ధి పనులు చేపట్టాలని ద్వివేది సూచించారు. అక్కడే ఉన్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, ఎంపీటీసీ కాలి అనురాధలు పంచాయతీలో శానిటేషన్ పనులు సక్రమంగా లేవని, ఏ అధికారి వచ్చినా రహదారిపై ఉన్న సంపద కేంద్రం తయారీ హంగునే చూస్తున్నారని, గ్రామంలో డ్రైన్‌లు చూడాలని కోరారు. దీంతో సీఎస్ ద్వివేది, కలెక్టర్ శుక్లా గ్రామంలోని డ్రెయిన్‌లు పరిశీలించి పారిశుధ్య పనుల నిర్వహణపై మండిపడ్డారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఎల్‌పీఓ బాలామణిని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో అందిస్తున్న పథకాలు, పనులు పర్యవేక్షణలో అధికారులు మరింత చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్ర, ఈఓపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జేవీకే స్టాక్ పాయింట్ల పరిశీలన



జేవీకే స్టాక్ పాయింట్లను తనిఖీ చేసి సూచనలు ఇస్తున్న ఆర్జేడీ నాగమణి

సామర్లకోట: మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందజేయడానికి సిద్ధం చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్లను ఆర్జేడీ జి.నాగమణి మంగళ వారం పరిశీలించారు. మండలానికి వచ్చిన పాఠ్య పుస్తకాలు, మండలంలో విద్యార్థుల సంఖ్యను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కిట్లను నిల్వ చేయాల్సిన విధానాన్ని వివరించారు. ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.



నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న దవులూరి దొరబాబు, పార్టీ శ్రేణులు

జగన్‌తోనే సుస్థిర పాలన

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు
- నియోజకవర్గంలో భారీ విజయోత్సవ ర్యాలీ

సామర్లకోట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర పరిపాలన అందించి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సీఎంగా పరిపాలన నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం నుంచి మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ సెంటర్ వద్ద అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు నివాళులు అర్పించి కేక్ కటింగ్ చేశారు. అనంతరం దొరబాబు విలేకరులతో మాట్లాడుతూ పేదల కోసం ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలనూ అమలు చేశారన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను అత్యధిక మెజార్టీతో ఎగుర వేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. నియోజకవర్గంలో స్థానికుడికి, స్థానికేతరుడికి పోరు జరుగుతోందని, తనను గెలిపిస్తే నీతివంతమైన పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. నియోజవర్గంలోని ప్రతి గ్రామం నుంచి తరలి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు నెక్కంటి సాయిప్రసాద్, ఉబా జాన్ మోజెస్, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్, వినుకొండ విష్ణుచక్రం, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రెండు మున్సిపాలిటీల కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



పిఠాపురంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజా సంక్షమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం పట్టణం జగ్గయ్యచెరువు కాలనీ 11వ వార్డు సచివాలయం పరిధి 21వ వార్డులో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో పర్యటించిన ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి వారిని పలకరించి ఆయా ఇంటిలో ఎవరెవరికి ఏయే పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఏ ఒక్క లబ్ధిదారుడికైనా పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలు టీడీపీ నేతల ఆదేశాల ఉంటే తప్ప వచ్చేవి కాదన్నారు. అలాంటి పైరవీలకు చెక్ పెడుతూ నేరుగా లబ్ధిదారులకే పథకాలు అందించేలా చర్యలు సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జగ్గయ్య చెరువు కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించే పనిలో భాగంగా రూ 35 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యమేల?

- అధికారులను నిలదీసిన కౌన్సిల్
- వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ సత్య భాస్కర్

పెద్దాపురం: పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉన్నా ఎందుకు పట్టించుకోవడం లేదని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు అధికారులను నిలదీశారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్ మాట్లాడుతూ పట్టణంలో వర్షం పడితే పారిశుధ్యం అధ్వానంగా తయారవుతోందన్నారు. వచ్చే వర్షాకాలం, మరిడమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని అధికారులు పారిశుధ్య పనులు మరింత మెరుగుపర్చాలని కోరారు. కౌన్సిలర్లు పప్పల దుర్గారావు, విడదాసరి రాజా మాట్లాడుతూ కాలువల్లో సిల్ట్ తీయాలని, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ మరమ్మతులు చేయాలని, పిచ్చి తుప్పలు తొలగించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, టీపీఓ ఉమామహేశ్వరరావు, డీఈఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆర్ఓ చంద్రశేఖరం, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, తలారి శ్యామలత, మున్సిపల్ మాజీ చైర్మన్ ముప్పన శ్యామలాంబ, కౌన్సిలర్లు సయ్యద్ అమీనాబీబీ, ఆకుల కృష్ణ బాపూజీతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటేశ్వరరావు

పిఠాపురం: స్పందన కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోడానికి ప్రతి మంగళవారం గ్రీవెన్స్ పరిష్కార కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో మంగళవారం గొల్లప్రోలు మండల గ్రీవెన్స్ పరిష్కార కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో వచ్చే సమస్యల పరిష్కారానికి కమిటీలో చర్చించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరుకాని సచివాలయ సిబ్బంది

కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ విధులకు సక్రమంగా హాజరుకావడంలేదు. కార్యాలయానికి వచ్చిన సమస్యలు చెప్పుకుందామని వచ్చిన అర్జీదారులు అతనికి ఫోన్ చేస్తే నాట్ రీచ్‌బుల్ అని వస్తోందని దీంతో వారు అసహనంతో తిరుగుమోఖం పడుతున్నారు. ఆయన విధుల్లోకి వచ్చినప్పటి నుంచి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను పట్టించుకున్న దాఖలాలే లేవని స్థానికులు చెబుతున్నారు. పారిశుధ్య అధ్వానంగా ఉంటోందని, దీనివల్ల రోగాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకుని దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా సచివాలయానికి సంబంధించి ప్రింటర్ గత కొంత కాలంగా పనిచేయకపోవడంతో అర్జీదారులు ప్రింట్ కోసం ప్రైవేటు జెరాక్స్, మీ సేవ సెంటర్లకు పరుగులు పెట్టాల్సి వస్తోందని చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది విధులు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎంపీడీఓ అబ్రహం లింకన్‌ను వివరణ కోరగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండాలి. తాను విధుల్లోకి వచ్చి 15 రోజులు అవుతున్న కారణంగా కార్యదర్శిపై ఆరా తీసి చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయంలో ప్రింటర్ పనిచేయకపోవడమనేది నా దృష్టికి వచ్చింది. త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ప్రతి నెల జరిగే మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ తెలిపారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులతో పాటు ఆయా శాఖలకు చెందిన అధి కారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

రేపటి నుంచి జెడ్పీ సభ్యులకు శిక్షణ



సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం

సామర్లకోట: ప్రజా ప్రతినిధులకు శిక్షణలో భాగంగా గురువారం నుంచి జూన్ 21 వరకు తొమ్మిది జిల్లా పరిషత్తుల పరిధిలోని జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నట్టు విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ జిల్లా పరిషత్తులు విభజన జరగకపోవడంతో పూర్వ జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలోని సభ్యులకు ఆరు బ్యాచ్‌లల్లో బ్యాచ్‌కు మూడు రోజుల చొప్పున శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణను పంచాయతీ రాజ్‌శాఖా మంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభిస్తారని తెలిపారు. శ్రీకాకుళం నుంచి 39 మంది, విజయనగరం నుంచి 34, విశాఖపట్నం నుంచి 40, తూర్పు నుంచి 60, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 49 మంది జెడ్పీటీసీ సభ్యులు శిక్షణకు హాజరవుతారని తెలిపారు. వీరికి పంచాయతీరాజ్ చట్టం, ప్రజా పరిషత్తుల ఏర్పాటు, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నిక, పదవీకాలం, రాజీనామా, జిల్లా ప్రజా పరిషత్తు చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యుల విధులు, అధికారాలు, బాధ్యత లు, బదలాయించిన శాఖలపై శిక్షణ ఉంటుందన్నారు. స్థాయీ సంఘాలు ఏర్పాటు, సమావేశాల నిర్వాహణ, చైర్మన్, వైస్ చైర్మన్ అవిశ్వాస తీర్మానం, సభ్యుల అనర్హత, జెడ్పీ సర్వ సభ్య సమావేశాల నిర్వాహణ, బడ్జెట్, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని వివరించారు.

సచివాలయ విధులకు వెసులుబాటు కల్పించండి

కాకినాడ సిటీ: వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలకు సచివాలయ పని వేళ్లలో ఉద్యోగాలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు ఆ సిబ్బంది మంగళవారం వినతి పత్రం అందించారు. నగరపాలక సంస్థలో 81 మంది పని చేస్తున్నామని, సచివాలయం పని వేళలు ఉదయం 10 నుంచి 5 గంటల వరకు అయినా, తాము శానిటేషన్ విధులకే పరిమితం అవుతున్నామని, సచివాలయం విధులకు హాజరు కాలేకపోతున్నామన్నారు. జాబ్ చార్టు ప్రకారం సాంకేతిక సమస్యలు, ప్రజలకు తాము సేవలందించాల్సి ఉందన్నారు. తమను సచివాలయం విధుల్లో భాగస్వాములను చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో భాగంగా తాము కూడా పాల్గొని కమిషనర్‌కు వినతి పత్రం అందించినట్లు వార్డు సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు వివరించారు.

కార్మిక చైతన్యంలో సీఐటీయూ పాత్ర కీలకం



సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సత్తిబాబు

పెద్దాపురం: దేశ వ్యాప్తంగా కార్మికుల్లో పోరాట చైతన్యం తీసుకురావడంలో సీఐటీయూ పాత్ర కీలకమని యూనియన్ జిల్లా కమిటీ సభ్యుడు డి.క్రాంతికుమార్, మండల కార్యదర్శి దాడి బేబి అన్నారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన జెండా ఆవిష్కరించగా గడిగట్ల సత్తిబాబు జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు నీలపాల సూరిబాబు, కేదారి నాగు నీలం రవి, వడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కోసమే నిరంతర పోరాటం
జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

సామర్లకోట: వివిధ ప్రైవేటు రంగాల్లోని కార్మికుల కోసం సీఐటీయు నిరంతరం పోరాడుతుందని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద యూనియన్ జెండాను మండల యూనియన్ అధ్యక్షుడు బాలం శ్రీనివాసు ఆవిష్కరించారు. ఈ మేరకు సీఐటీయూ విశిష్టతపై సదస్సు నిర్వహించారు. మండల కార్యదర్శి నరవ సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు కరణం ప్రసాదరావు, మండల నాయకులు చల్లా మహేష్, అంగన్‌వాడీ అర్బన్, రూరల్ నాయకులు ఎ అమలావతి, టి నాగమణి, కె వరలక్ష్మి, బాలం లక్ష్మి, జి. మహాలక్ష్మి, ఎస్‌కె ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలి



విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న సీఐ నబీ

పెద్దాపురం: ప్రతి విద్యార్థీ సామాజిక బాధ్యతతో మెలిగితే మంచి ఫలితాలు సాధించవచ్చని సీఐ అబ్దుల్ నబీ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం పీసీసీ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీసీసీ క్లబ్ కో–ఆర్డినేటర్ రొంగల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో సీఐ నబీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ గురువు, తల్లిదండ్రుల పట్ల గౌరవంతో మెలిగుతూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న సమాజాన్ని మన అభివృద్ధికి వినియోగించాలే తప్ప తప్పుడు మార్గాలకు కాదన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు, యూటీఎఫ్ నాయకులు ప్రభాకర వర్మ, చంద్రశేఖర్, జేవీవీ నాయకులు బి.అనంతరావు మాట్లాడుతూ విద్యార్థులు మరింత పరిజ్ఞానంతో ఉన్నత శిఖరాలను అధిగమంచి మంచి ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సీఐ నబీ మెమెంటోలు అందజేశారు. కూనిరెడ్డి అరుణ, డి.క్రాంతికుమార్, నెక్కల రవిచంద్ర, అమృత, నమ్రత, పూజిత, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

మరుగుకు దారేదీ..



పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కక్షిదారులు

- అవస్థలు పడుతున్న కక్షిదారులు
- సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని వినతి

పెద్దాపురం: ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యాల్లో ఒకటి. అంతవరకు బాగానే ఉన్నా ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల అవసరార్థం మరుగుదొడ్డి లేకపోవడంతో ఏ చెట్టో, పుట్టో చాటు చేసుకుని పని కానిచ్చుకోవలసిన పరిస్థితి శోచనీయం. గ్రామీణ ప్రాంతాలకు మండల కేంద్రం పదుల కిలో మీటర్ల దూరంలో ఉన్నా పనులన్నీ అక్కడే ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లోనే సాగుతాయి. కొన్ని పనులు అవశ్యం అయినా, కొన్ని పనులు ఆలస్యం అవుతుంటాయి. ఈ పరిస్థితుల్లో కక్షిదారులు మరుగు అవసరాలు తీర్చుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు.

పెద్దాపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ట్రెజరీ, సబ్ జైలు, గృహ నిర్మాణం, ఉపాధి కార్యాలయం, వైఎస్సార్ క్రాంతిపథం – మహిళా సమాఖ్య కార్యాలయం అన్నీ ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. గృహ నిర్మాణ శాఖ, ట్రెజరీ, తహసీల్దార్, వెలుగు, వ్యవసాయ శాఖ ప్రభుత్వ కార్యాలయాల్లోనే మరుగుదొడ్లు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు వచ్చే వారి కోసం కనీసం ఒక్క మరుగుదొడ్డి కూడా లేదు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి...



ప్రతి రోజూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణ పరిధిలో అవసరాల నిమిత్తం కక్షిదారులు వస్తుంటారు. మగవారి మాట ఎలా ఉన్నా, మహిళలు మరుగు అవసరాలకు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

– గుణ్ణం లక్ష్మణరావు, ఫర్ ద పీపుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు, పెద్దాపురం

నాడు–నేడు పనులు వేగవంతం చేయండి

కాకినాడ: నాడు–నేడు పథకంలో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో నాడు–నేడు పనుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపాదించిన పనులన్నీ త్వరతగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి, ఈఈ వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మండల పరిధిలో ఆయా గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరు సూచనల మేరకు అచ్చంపేట, మాధవపట్నం, నవర, ఉండూరు గ్రామాల్లో ఒకొక్క పోస్టులకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఈ మేరకు జూన్ రెండో తేదీ లోగా స్థానికులై, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.